## క్లుప్తంగా

### ఎంపీ వైవీ సుబ్బారెడ్డికి ఎమ్మెల్యే మత్స్యలింగం పరామర్శ



ఎంపీ వైవీ సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

**మేదరమెట్ల:** రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాతృమూర్తి యర్రం పిచ్చమ్మ ఇటీవల మృతి చెందడం తెలిసిందే. ఈ మేరకు కొరిశపాడు మండలం మేదరమెట్ల గ్రామంలోని ఎంపీ నివాసంలో బుధవారం పిచ్చమ్మ చిన్నకర్మ జరిగింది. ఈ సందర్భంగా పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైవీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అరకు శాసనసభ్యుడు రేగం మత్స్యలింగం కూడా వైవీ సుబ్బారెడ్డిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

### 25 నుంచి సీతపల్లి బాపనమ్మ ఉత్సవాలు



సీతపల్లి బాపన్న ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

**రంపచోడవరం:** మండలంలో సీతపల్లి గ్రామంలో కొలువైన మాతృశ్రీ గడి బాపనమ్మ అమ్మవారి జాతర పోస్టర్‌ను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో సత్యరమేష్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 29 వరకు ఐదు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా జరుగుతాయన్నారు.

### రేపు డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం

**పాడేరు :** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనుమూ చిట్టిబ్బాయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యువతీ, యువకులు బాధ్యతగా రక్తదానం చేసి ఆపత్కాలంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని కోరారు.

### స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు దరఖాస్తుల ఆహ్వానం

**గూడెం కొత్తవీధి:** జిల్లా బీసీ కో–ఆపరేటివ్ సొసైటీ ద్వారా స్వయం ఉపాధి యూనిట్ల నిర్మాణానికి సంబంధించి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు గూడెం కొత్త వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. ఏపీవోబీఎంఎంఎస్ ద్వారా దరఖాస్తులను ఆయా సచివాలయాలు లేదా సమీపంలోని మీసేవ కేంద్రాల ద్వారా నమోదు చేసుకోవచ్చునన్నారు. టైలరింగ్ యూనిట్లకు సంబంధించి బీసీలకు 14, ఈబీసీ 1, కాపులకు 11 యూనిట్లు మంజురయ్యాయన్నారు. ఈ నెల 22వ తేదీలోగా అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

### గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



గంజాయి నిందితుడితో పోలీసులు

**సీలేరు:** సీలేరు నుంచి తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న వ్యక్తిని సీలేరు పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. దీనిపై ఎస్‌ఐ రవీంద్రనాథ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుధవారం ఉదయం ఐటీఐ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని విచారించగా.. అందులో గంజాయి ఉందని గుర్తించామన్నారు. 2 కేజీల గంజాయితో బస్సు ఎక్కేందుకు సిద్ధంగా ఉండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తమిళనాడుకు చెందిన పొన్నుస్వామి(36)ని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. గంజాయి అమ్మిన ఒడిశాలో మల్కన్‌గిరి జిల్లా పసుపులంక గ్రామానికి చెందిన మహదేవ్ పరారీలో ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు.

### సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

**ముంచంగిపుట్టు:** మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ గడ్డిబంధ గ్రామంలో సీసీ రోడ్డు పనులకు బుధవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ పాంగి పద్మారావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో 100 మీటర్ల సీసీ రోడ్డు వేస్తామన్నారు. సీసీ రోడ్డు మంజూరు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్రకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నేతలు సన్యాసిరావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

# శిథిల అంగన్‌వాడీ కేంద్రాలకు మోక్షమెప్పుడో?






శిథిలావస్థకు చేరిన కేంద్రం శ్లాబ్



శిథిలావస్థకు చేరిన బంగారుమామిడి అంగన్‌వాడీ కేంద్రం



శ్లాబ్ నుంచి కింద పడిన పెచ్చులు

**పెదబయలు:** మండలంలో 23 పంచాయతీల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. తప్పనిసరి పరిస్థితిలో ఆయా కేంద్రాల్లో చిన్నారులు, సిబ్బంది భయం భయంగా నెట్టుకొస్తున్నారు. ఎప్పుడు శ్లాబు నుంచి పెచ్చులూడి పడుతుందోనని భయాందోళన చెందుతున్నారు. మండలంలో 193 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. భవనాలు ఉన్న కేంద్రాలు 51, శిథిలావస్థలో ఉన్న భవనాలు 9, అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలు 127, 8 కేంద్రాలు ఆయా గ్రామాల్లోని పాఠశాల గదుల్లో కొనసాగుతున్నాయి. మండలంలోని అన్ని కేంద్రాల్లో 7,226 మంది పిల్లలు, బాలింతలు 635, గర్భిణులు 602 మంది సేవలు పొందుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి అధ్వానంగా ఉంది. కిముడుపల్లి పంచాయతీ బంగారుమామిడి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ భవనం శ్లాబ్ నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ కేంద్రంలో 18 మంది పిల్లలు, 22 మంది గర్భిణులు, 36 మంది బాలింతలు సేవలు పొందుతున్నారు. కేంద్రానికి పిల్లలను తల్లిదండ్రులు పంపించకపోవడంతో ఓ ఇంటి వరండాలో కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. గతంలో నాడు–నాడు పథకం కింద 26 కేంద్రాలు మంజూరు కాగా.. ఒక కేంద్రం మాత్రమే పూర్తయింది. మిగతా 25 కేంద్రాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనాన్ని కూల్చివేసి, పునర్నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు

#### తరచూ పెచ్చులు పడుతున్నాయి..



బంగారుమామిడిలోని అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. తరచూ శ్లాబు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. వర్షా కాలంలో కారిపోతుంది. దీంతో కేంద్రం లోపల పిల్లలను కూర్చోబెట్టడం లేదు. ఓ ఇంటి వరండాలో బోధన సాగిస్తున్నాం. అధికారులు స్పందించి నూతన భవనం మంజూరు చేయాలి.

– సీదిరి జానకమ్మ, అంగన్‌వాడీ ఆయా, బంగారుమామిడి గ్రామం

#### ఉన్నతాధికారులకు భవనాలు లేని కేంద్రాల జాబితా

మండలంలోని 193 కేంద్రాల వివరాలు, శిథిలావస్థకు చేరిన భవనాలు, తదితర వివరాలను 6 నెలల క్రితం ఉన్నతాధికారులకు నివేదించాం. 151 కేంద్రాలు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. మిగతా 142 కేంద్రాలకు భవనాలు లేవు. కొన్ని అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. వీటిలో 8 కేంద్రాలు సమీప పాఠశాల గదుల్లో నిర్వహిస్తున్నాం. శిథిల భవనాల్లో కేంద్రాలు నడపవద్దని ఆదేశాలిచ్చాం. భవన సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారు.

– ఎం.వరహాలమ్మ, సీడీపీవో, పెదబయలు మండలం

## సేంద్రియ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపీపీ అనూషదేవి, ఎంపీడీవో

**చింతపల్లి:** మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ఎంపీపీ కోరాబు అనూషదేవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ వ్యవసాయ శాఖ, రైతు సాధికారత సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను ఎంపీడీవో శ్రీనివాసరావుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం పండిస్తున్న పంటల్లో ఎక్కువగా రసాయనాలు వాడకంతో ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో సేంద్రియ పద్ధతిలో పండిస్తున్న పంటలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన కూరగాయలను వారు కొనుగోలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి మధుసూదనరావు, హౌసింగ్ ఏఈ వెంకటరమణ, సర్పంచ్ దురియా పుష్పలత, వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి గణబాబు, బెన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌డామ్ నిర్మాణ పనుల పరిశీలన



చీకుంబందలో చెక్‌డామ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

**జి.మాడుగుల:** మండలంలో పాలమామిడి పంచాయతీ చీకుంబంద గ్రామంలో రూ.18 లక్షలతో నిర్మిస్తున్న చెక్‌డామ్ నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ పరిశీలించారు. చెక్‌డామ్ నిర్మాణ పనులు నాణ్యతతో నిర్మించాలని ఆయన సూచించారు. డామ్ నిర్మాణ పనులు వేగవంతం చేసి పంట భూములకు సాగునీరు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్నబ్బాయి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జ్యోతి పాల్గొన్నారు.

## కొక్కిరమ్మతల్లి జాతర ప్రారంభం



పూజలందుకున్న కొక్కిరమ్మతల్లి

**జి.మాడుగుల:** మండలంలో పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లి గ్రామంలో కొలువైన కొక్కిరమ్మతల్లి జాతర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. సర్పంచ్ సురభంరామకృష్ణ ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు భక్తిశ్రద్ధలతో ఘటాలను డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఆలయ సమీపమున ఏర్పాటు చేసిన సతకంపట్టు వద్దకు చేర్చారు. ఇక్కడ మూడు రోజుల పాటు భక్తులు పూజలు నిర్వహిస్తారు. శుక్రవారం సాయంత్రం ఘటాలను డప్పు వాయిద్యాలు, కోలాటాలు, థింసా నృత్యాల నడుమ ఘాటీ రోడ్డులో అమ్మవారి మూలవిరాట్‌కు చేర్చుతారు. ఉత్సవాల్లో భాగంగా క్రికెట్, వాలీబాల్, తదితర క్రీడా పోటీలను ఏర్పాటు చేశారు. విజేతలకు నగదు బహుమతి, జ్ఞాపికలు అందజేయనున్నారు. మూడు రోజుల పాటు రాత్రి సమయాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

## పలకజీడిలో వైద్య శిబిరం, వాలీబాల్ పోటీలు రేపు

**కొయ్యూరు:** పలకజీడిలో పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం, వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నామని మంప ఎస్‌ఐ శంకరరావు బుధవారం విలేకరులకు తెలిపారు. పలకజీడిలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. బూదరాళ్ల, యూ చీడిపాలెం, ఎం భీమవరం పంచాయతీలకు చెందిన క్రీడాకారులతో వాలీబాల్ పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి చూపే వారికి సమాచారం ఇచ్చామన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సంఘటన స్థలంలో యువకుడి మృతదేహం



నుజ్జునుజ్జయిన పల్సర్ బైక్

**పాడేరు :** మండలంలోని గుత్తులపుట్టు సమీపంలో ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రాథమిక సమాచారం మేరకు పెదబయలు మండలం పెదకోడాపల్లి పంచాయతీ కోట్ల గరువు గ్రామానికి చెందిన ఓ యువకుడు బైక్‌పై బుధవారం రాత్రి 7 గంటల సమయంలో గుత్తులపుట్టు వస్తుండగా.. రహదారి పక్కన ఉన్న 11 కేవీ విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు పాలైన యువకుడు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. బైక్ నుజ్జునుజ్జయింది. ఎస్‌ఐ సూర్యనారాయణ మాట్లాడుతూ ఈ ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని, మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తామని చెప్పారు.

## గిరిజన సంప్రదాయాల పరిరక్షణకు కృషి

**డుంబ్రిగుడ:** గిరిజన సంప్రదాయాల పరిరక్షణకు సీపీఎఫ్ సంస్థ కృషి చేస్తుందని ఆ సంస్థ కోఆర్డినేటర్ గాసినాయుడు తెలిపారు. మండలంలోని లైగండ, తూటంగి, గుంటగన్నెల మూడు పంచాయతీల సచివాలయం సిబ్బందితో కలిసి ఆదివాసీ రైతు సంఘాలు, రైతులు, ప్రజలకు సంస్థ ఆధ్వర్యంలో గేదలబంద గ్రామంలో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసులతో పూర్వపు వ్యవసాయం, సంప్రదాయ ఆహార పంటలు, సంస్కృతి సంప్రదాయాలు, పర్యావరణ పరిరక్షణ కోసం నాలుగు రాష్ట్రాల్లో పని చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తూటంగి పంచాయతీ సర్పంచ్ లక్ష్మి, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొని వర్మీకంపోస్టు కిట్స్, కషాయం పిచికారీ కోసం రక్షణ దుస్తులు పంపిణీ చేశారు.

## ప్రజలకు మరింత చేరువగా తపాలా సేవలు



రాజవొమ్మంగి పోస్టాఫీస్ వద్ద కొత్త ఖాతాలు తెరుస్తున్న సిబ్బంది

**రాజవొమ్మంగి:** ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు ద్వారా తపాలా సేవలు ప్రజలకు మరింత చేరువకానున్నాయని కాకినాడ బ్రాంచి మేనేజర్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. ఆయన బుధవారం స్థానిక సబ్‌పోస్టాఫీస్ ఆవరణలో జరిగిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో మాట్లాడారు. ఖాతా తెరిస్తే ఆధార్ సీడింగ్, ప్రమాద బీమా, జీవిత బీమా వంటి సదుపాయాలు లభిస్తాయన్నారు. ఖాతాదారుడు ఏడాదికి రూ. 550 ప్రీమియం చెల్లిస్తే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, ప్రమాదం జరిగితే ఆస్పత్రి ఖర్చుల కోసం రూ. లక్ష వరకు నామినికి అందజేస్తామన్నారు. ఈ బీమా సదుపాయం 18 నుంచి 65 సంవత్సరాల వయస్సు గల వారికి వర్తిస్తుందన్నారు. అనంతరం స్థానికులతో కొత్తగా ఖాతాలు తెరిపించి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ ఎస్. బాలాజీరావు, పోస్టు మాస్టార్ ప్రేమ్‌కుమార్, మండలంలోని 20 బ్రాంచ్ పోస్టాఫీసులకు చెందిన పోస్టుమాస్టార్లు, ఈడీ సిబ్బంది పాల్గొన్నారు.

## సునీతా విలియమ్స్ రాకను ఆసక్తిగా వీక్షణ



టీవీలో సునీత విలియమ్స్ రాకను వీక్షిస్తున్న చెరకుంపాలెం పాఠశాల చిన్నారులు

**రాజవొమ్మంగి:** అనుకోని రీతిలో దాదాపు 9 నెలల పాటు అంతరిక్షంలోనే ఉండిపోయి బుధవారం సురక్షితంగా భూమికి చేరుకున్న సునీతా విలియమ్స్ రాకను టీవీల్లో విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. భారత సంతతికి చెందిన విలియమ్స్ ప్రపంచస్థాయి కీర్తిని సాధించడం పట్ల తమ ఆనందం వ్యక్తం చేశారు. బుధవారం పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు విలియమ్స్ భూమికి చేరుకున్న దృశ్యాలను టీవీల ద్వారా చూసే అవకాశం విద్యార్థినీ, విద్యార్థులకు కల్పించారు.

## ఆర్టీసీ డీఎంకు సన్మానం



ఆర్టీసీ డీఎం రామన్నదొర దంపతులను సన్మానిస్తున్న చెరువూరు గిరిజనులు

**రంపచోడవరం:** తమ గ్రామానికి ఆర్టీసీ సేవలు అందుబాటులోకి తీసుకు వచ్చి బదిలీపై వెళ్లిన గోకవరం ఆర్టీసీ డీఎం యు.రామన్నదొరకు చెరువురు గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. డీఎం దంపతులను బుధవారం మేళతాళాలతో ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకొచ్చి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామన్నదొర మాట్లాడుతూ గోకవరం డిపో నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించామన్నారు. ఆర్టీసీకి కొన్ని రూట్ల కారణంగా నష్టం వచ్చినా ఆదివాసీలకు ఆర్టీసీ సేవలందాలని ఉద్దేశంతో గుర్తేడు, కోట, పాతకోట, పాముగండి, వై.రామవరం తదితర గ్రామాలు సర్వీసులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కార్మిక పరిషత్ అధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, స్టేట్ కార్మిక పరిషత్ సెక్రటరీ శ్రీనివాసరావు, ఏవో కె.లక్ష్మణరావు, సర్పంచ్ పల్లాల సీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు వైఎస్సార్‌సీపీ సాయం



బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు

**వీఆర్‌పురం:** అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి సత్తిబాబు బుధవారం నిత్యావసర సరకులు, కొంత నగదు అందజేశారు. ఇటీవల కుందులూరు రామవరం పంచాయతీల పరిధిలో మూడు ఇళ్లు దగ్ధమయ్యాయి. ఈ మేరకు బాధితులకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.8 వేలు నగదు, నిత్యావసర సరకులు, దుస్తులు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్తిబాబు మాట్లాడుతూ బాధితులకు తక్షణమే ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బొడ్డు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి చిక్కాల బాలు, చిన్నమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, కుందులూరు సర్పంచ్ బంధం జయ, రేఖపల్లి ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, ఎస్సీ సెల్ మండల నాయకులు మాచర్ల వెంగళరావు, బంధం రాజు, తెల్లం తమ్మయ్య, కన్నారావు, మడకం కన్నారావు, వైస్ ప్రెసిడెంట్ మాడి ముత్యాలరావు, కుంజా నాగేశ్వరరావు, సోడె రామారావు, పటేల్, కారం బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

## పీసా కమిటీ పాడేరు మండల కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న మండల కమిటీ సభ్యులు

**పాడేరు రూరల్:** మండలంలో పీసా కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. కమిటీ గౌరవాధ్యక్షుడిగా సల్ల రామకృష్ణ, అధ్యక్షుడిగా వంజంగి రమేష్‌నాయుడు, కార్యదర్శిగా లకే అబ్బాయిదొర, మండల ఫోరం అధ్యక్షుడిగా బోనంగి రమణ, ఉపాధ్యక్షులుగా రొబ్బ కృష్ణారావు, శ్రీనివాసరావు, బాలరాజు, సహాయ కార్యదర్శులుగా యువరాజు, త్రినాథ్, సింహచలం, వెంకటేష్, పాలిక్కి లక్కు, కూడ సింహాచలం, కోశాధికారిగా కొట్టగుల్లి సింహాచలంనాయుడు, 11 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌నాయుడు, లకే అబ్బాయిదొర మాట్లాడుతూ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో మరింత బాధ్యత పెరిగిందని, గిరిజన చట్టాలు, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.

## సాయినగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



ట్యాంకర్‌తో నీటి సరఫరా చేస్తున్న ఎంపీపీ అనూషదేవి, ఎంపీడీవో శ్రీనివాసరావు

**చింతపల్లి:** స్థానిక సాయినగర్ వీధిలో మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎంపీపీ కోరాబు అనూషదేవి, సర్పంచ్ దురిమా పుష్పలత తెలిపారు. ఈ వీధిలో జిల్లా పరిషత్ నిధులతో బోరు నిర్మాణం చేపట్టి పంచాయితీ నిధులతో మోటారు ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంతంలో మోటారు నుంచి మంచినీటి ట్యాంకుకు వెళ్లే ప్రధాన పైపులైనుకు కొంత మంది దొంగ కనెక్షన్లు తగిలించి నీటి చౌర్యానికి పాల్పడుతున్నారని, దాంతో ట్యాంకు నిండడం కష్టమవుతుందని చెప్పారు. అటువంటి వారు స్వచ్ఛందంగా కనెక్షన్లు తొలగించి అధికారులకు, పంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. ప్రస్తుతం నీటి సమస్య లేకుండా ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంచినీటి సరఫరా విభాగం ఏఈ స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్తా శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

## నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

**చింతపల్లి:** మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ భీ–పడాయి భీ కార్యక్రమంపై గురువారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్టు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి జి.వి.రమణ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగే ఈ శిక్షణలో పిల్లలు ఎదుగుదల, తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఇచ్చే ఆహార పదార్థాలు ఎలా తీసుకోవాలి, పిల్లల పట్ల తల్లులు తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

**హుకుంపేట:** పోషణ్ భీ–పడాయి భీ శిక్షణ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం నుంచి మూడు రోజుల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణిదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ రెండు బ్యాచ్‌లుగా విభజించి ఎంపీడీవో, సీడీపీవో కార్యాలయాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**అడ్డతీగల:** అంగన్‌వాడీ వర్కర్లకు ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని అడ్డతీగల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవో సిహెచ్.లక్ష్మి తెలిపారు.

## చింతపల్లి ముత్యాలమ్మ జాతర కమిటీ సమావేశం రేపు

**చింతపల్లి:** చింతపల్లిలో ముత్యాలమ్మ జాతర కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్టు ఎంపీపీ కోరాబు అనూషదేవి, సర్పంచ్ దురియా పుష్పలత తెలిపారు. బుధవారం తొలి రోజు ముహూర్తంగా ముత్యాలమ్మ ఆలయంలో వారు స్థానికులతో కలసి సమావేశమయ్యారు. ప్రతి ఏటా ఎంతో వైభవంగా జరుపుకొనే ఈ జాతరకు సంబంధించి చర్చించి తేదీలను నిర్ణయించడంతో పాటు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసుకోవడానికి శుక్రవారం మధ్యాహ్నం శ్రీముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించనున్నామన్నారు. అందరూ హాజరు కావాలని కోరారు.


## రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలి



గంగవరం పీహెచ్‌సీలో ల్యాబ్‌ను పరిశీలిస్తున్న పీవో

**గంగవరం:** ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం వైద్య సిబ్బందిని ఆదేశించారు. గంగవరంలో బుధవారం పర్యటించిన ఆయన స్థానిక పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఇక్కడికి వచ్చిన రోగులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతిరోజు ఎంతమంది అవుట్ పేషెంట్లు వస్తున్నారు, ఆస్పత్రిలో ఎంతమంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మందులను అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. ల్యాబ్‌ను పరిశీలించి రక్తనమూనాలు సేకరణ గురించి ఎల్‌టీ వెంకటలక్ష్మి, కృష్ణవేణిలను ఆరా తీశారు. డిప్యూటీ తహసీల్దార్ స్వామి, ఆర్‌ఐ టి.లక్ష్మణ్, వైద్యాధికారి ముకేంద్ర, సీహెచ్‌వో మేరీ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న 'పది' పరీక్షలు



గూడెంకొత్తవీధిలో పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న తహసీల్దారు రామకృష్ణ

**గూడెంకొత్తవీధి:** పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో జరుగుతున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం స్థానిక తహసీల్దారు రామకృష్ణ తనిఖీ చేశారు. ఏ, బీ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన ఆయన అక్కడ సదుపాయాలను పరిశీలించారు.

**జి.మాడుగుల:** మండలంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో బుధవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జీఎం కొత్తూరులోని పరీక్ష కేంద్రంలో 150 మంది విద్యార్థులకు ఒకరు గైర్హాజరయ్యారు. గురుకులం పాఠశాలలో 190 మంది విద్యార్థులు శత శాతం పరీక్షలు రాశారు. ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో 96 మంది విద్యార్థులకు ఇద్దరు గైర్హాజరయ్యారు. గాంధీ నగరం గ్రామంలోని కేంద్రంలో 137 విద్యార్థులకు ఒకరు గైర్హాజరయ్యారని ఎంఈవో సిహెచ్.బాబూరావుపడాల్ తెలిపారు.

**పెదబయలు:** రెండో రోజు హిందీ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండలంలోని మూడు పరీక్ష కేంద్రాల్లో 626 మంది విద్యార్థులకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో కృష్ణమూర్తి తెలిపారు.